# పోలవరంలో ఘనంగా ప్రారంభమైన జనగణన2027 ప్రక్రియ

## - తొలి స్వీయ గణన నమోదు చేసుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు





**పోలవరం:ప్రతినిధి ఏప్రిల్ 16 (ప్రజా వీక్షణం)**

భారత జనగణన2027 కార్యక్రమంలో భాగంగా గృహ జాబితా మరియు గృహ గణన ప్రక్రియ పోలవరం నియోజకవర్గంలో గురువారం అధికారికంగా ప్రారంభమైంది. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఈ ప్రక్రియను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీలుగుమిల్లి తాసిల్దార్ వెంకటేశ్వర రావు సమక్షంలో ఎమ్మెల్యే తన మొబైల్ ఫోన్ ద్వారా స్వీయ గణన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి నియోజకవర్గంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు మరియు అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో జనగణన అత్యంత కీలకమైన ఘట్టమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలన్నా, మౌలిక సదుపాయాల కల్పన జరగాలన్నా ఖచ్చితమైన గణాంకాలు అవసరమని ఆయన వివరించారు. నియోజక వర్గంలోని ప్రతి కుటుంబం తమ వివరాలను నిజాయితీగా, ఖచ్చితంగా నమోదు చేసి ఈ జాతీయ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 16 నుండి 30 వరకు పౌరులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చు. మే 1 నుండి 30 వరకు సిబ్బంది నేరుగా ఇళ్లకు వచ్చి వివరాలు సేకరిస్తారు. వెబ్‌సైట్ ద్వారా లేదా అధికారిక క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలు నమోదు చేయవచ్చు. గణన సమయంలో కుటుంబ సభ్యుల వివరాలు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్ 1855 ను సంప్రదించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ రాములు నాయక్, డీటీ పెద్దిరాజు, రెవెన్యూ సిబ్బంది, ఇతర ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 20న టిడిపి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 16 (ప్రజా వీక్షణం)**


ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 20న భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నామని తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) తెలిపారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన గురువారంవిలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ను టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించడంతో పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. పొలిట్ బ్యూరో సభ్యులుగా నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును, ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు పితాని సత్యనారాయణను, మైనారిటీ సలహాదారులు షరీఫ్ ను, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజును నియమించడం అభినందనీయమని ప్రశంసించారు. పట్టణంలోని మాగంటి కళ్యాణ మండపంలో ఈ నెల 20న ఏర్పాటు చేయనున్న రక్తదాన శిబిరంలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రి, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్త సేకరణ జరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో కిలపర్తి వెంకట్రావు, పట్నాల రాంపండు, గొర్రెల శ్రీధర్, దాసరి అప్పన్న, పద్మనాభుని మురళి, సబ్నివిసు కృష్ణమోహన్, దాట్ల జగన్నాథరాజు, ముత్యాల శ్రీనివాస్, ఏరుబండి సతీష్, కాకర్ల సుభద్ర, సీలి వెంకటాచలం, అంబటి వాసు, దలై తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



# జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిని చేయటమే లక్ష్యంగా పనిచేయాలి

## - వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం






**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 16 (ప్రజా వీక్షణం)**

వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిని చేయటమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను కలుపుకుని నూతన కమిటీలు పనిచేయాలని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు సూచించారు. వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం ఇటీవల ప్రకటించిన పలు కమిటీల్లో పదవులు పొందిన పలువురు నియోజకవర్గ నాయకులను ఆయన స్థానిక కార్యాలయంలో గురువారం ఘనంగా సత్కరించారు. జిల్లా ఆర్గనైజేషనల్ కార్యదర్శులుగా వింజమూరి శ్రీనివాసు, మద్దుకూరి మెహర్ ప్రసాద్, యాక్టివిటీ జిల్లా కార్యదర్శిగా కందుబోయిన కృపావరం, తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్షుడిగా గొర్రెల శ్రీనివాసు, తాడేపల్లిగూడెం మండల అధ్యక్షుడిగా చిట్టూరి భాస్కరరావు(బాపన్న), పెంటపాడు మండల అధ్యక్షుడిగా కైగాల శ్రీనివాసు, తాడేపల్లిగూడెం మండల ఉపాధ్యక్షుడిగా దారపురెడ్డి శ్రీనివాసు, పెంటపాడు మండల ప్రధాన కార్యదర్శిగా దొడ్డిగర్ల చంద్రయ్య, గూడెం మండల కార్యదర్శిగా గోపిశెట్టి వెంకన్నదొర, పెంటపాడు మండల కార్యదర్శిగా పిల్లి నాగరాజులను పార్టీ అధిష్టానం నియమించింది. జిల్లా, మండలస్థాయి పదవులు పొందిన పలువురు నాయకులు పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి, నియోజకవర్గ కన్వీనర్ వడ్డి రఘురామ్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తామని, మళ్ళీ నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగురవేసేందుకు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కమిటీ సభ్యులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. పార్టీలో క్రియాశీలకంగా పని చేసే నాయకులకు, కార్యకర్తలకు రాబోయే రోజుల్లో మంచి గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అరాచకాలు, వైఫల్యాలపై గ్రామాల్లో ప్రజా పోరాటం చేయాలన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ప్రజలకు మేమున్నామనే భరోసాను అందిస్తూ ముందుకు సాగాలని వివరించారు. ముందుగా పదవుల పొందిన నాయకులు రఘురాం నాయుడిని భారీ గజమాలతో సత్కరించారు.

# వివాదాలకు నిలయంగా మారిన కాళోజీ నారాయణ రావు హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ

## - ఏబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 16 (ప్రజా వీక్షణం న్యూస్)**



KALOJI NARAYANA RAO UNIVERSITY OF HEALTH SCIENCES
WARANGAL, TELANGANA - 506002

Lr.No:19/KNRUHS/Exams/UG/MBBS/2026 Dated:16.04.2026

To
The Principals of all Colleges
Offering MBBS Course
Affiliated to KNRUHS, TG, Warangal.

Sir/Madam,

Sub:- KNRUHS – Examination Wing – Final MBBS (New Regulations) Part-II Regular Examinations, April 2026 – General Surgery Paper–I Examination – Conduct of Re-examination - Communicated – Reg.

Ref:- 1. This office Lr.No.19/KNRUHS/Exams/Notification/2026, Dated: 09.02.2026
2. This office Lr.No.19/KNRUHS/Exams/UG/MBBS/2026, Dated: 17.02.2026

*****

It is hereby informed that the General Surgery Paper–I examination conducted on 15.04.2026 stands cancelled due to technical reasons.

The Re-examination will be conducted on 27.04.2026 (Monday).

Hence, the Principals of all Colleges offering MBBS Course are hereby requested to inform the above date of re-examination of General Surgery Paper-I to the students and HODs/faculty concerned and to inform the same in the examination halls during the exams.

Controller of Examinations
KNRUHS, TG, Warangal

Page. 1

తెలంగాణ రాష్ట్రంలో మెడికల్ విద్యకు పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్ లోని కాళోజీ నారాయణ రావు హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ నిత్యం వివాదాలకు కేరాఫ్ గా నిలుస్తున్నదని ఏబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు ఆరోపించారు. ఎం బి బి ఎస్ జనరల్ సర్జరీ పేపర్-1 ఎగ్జామ్ ను టెక్నికల్ రీజన్స్ తో రద్దు చేస్తున్నట్లు, తిరిగి 27-04-2026 రోజున పరీక్షను మళ్ళీ నిర్వహించ నున్నట్లు యూనివర్సిటీ ఒక సర్క్యులర్ జారీ చేయడం జరిగిందని, దీనికి ప్రధాన కారణం పరీక్షల నియంత్రణ అధికారి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్ పర్సన్ నిర్లక్ష్యం కారణంగా పరీక్ష పత్రంలో తప్పు దొర్లడమే అన్నారు. పరీక్షను రద్దు చేసిన కారణంగా విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ఇంకెన్నాళ్ళు మీరు చేస్తున్న తప్పులకు మేం శిక్షను అనుభవించాలని వాపోతున్నారన్నారు. మళ్ళీ పరీక్ష నిర్వహిస్తే రాసే స్థితిలో లేమని, ఇలాంటి వాటివల్ల ముందు రాసే పరీక్షలపై ఫోకస్ చేయలేక పోతున్నట్లు విద్యార్థులు తెలిపారన్నారు. ఇలాంటి ఘటనలు యూనివర్సిటీలో కొత్తేమీ కాదని గతంలో పాత ప్రశ్నా పత్రం తోనే పరీక్షలు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నా యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారుల తీరు మారట్లేదన్నారు. గతంలో పని చేసిన ఉపకులపతి తన వ్యక్తిగత ప్రవర్తనతో పాటుగా, పీజీ పరీక్షల పత్రాల మూల్యాంకనం లో పరిపాలనా నిర్ణయాలలో అవకతవకలకు పాల్పడడం కారణంగా స్వయంగా రాజీనామా చేసి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. యూనివర్సిటీకి నియమింప బడే ఉప కులపతులు హైద్రాబాద్ కేంద్రంగా పాలన కొనసాగిస్తారని, యూనివర్సిటీలో చుట్టపు చూపుకు వచ్చి వెళ్తారని అందుకే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఇంకా సిబ్బంది నియామకాల్లో, కళాశాలలకు అనుమతుల విషయంలో అనేక ఆరోపణలు వస్తున్న ప్రభుత్వం పట్టించు కోవట్లేదన్నారు. ఇప్పటికైన యూనివర్సిటీలో జరుగుతున్న పరిణామాల పై హై లెవెల్ కమిటీ నీ నియమించి నిష్పాక్షికంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచిపెట్టే బిల్లు

## - మహిళా బిల్లుపై ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ అక్కసు

**న్యూఢిల్లీ,ఏప్రిల్16 (ప్రజా వీక్షణం)**

పార్లమెంట్ సమావేశాల్లో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గ పునర్విభజన బిల్లుపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ చర్చను ప్రారంభించారు. అయితే.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించారు. మహిళా బిల్లుకు నిరసనగా సాహిర్ లుధియాన్వి రాసిన ఓ కవితను లోక్‌సభా ముఖంగా చదివి వ్యతిరేకించారు. ఈ బిల్లు సమాఖ్య వాద ఉల్లంఘన కిందకు వస్తుందని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొంటూ.. దీనిని సభలో ప్రవేశపెట్టడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. ఈ చర్చ మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ఇది ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు ఈ బిల్లు మరింత అధికారాన్ని ఇస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అరికడుతుందని ఒవైసీ వాదించారు.

